పడకేసిన పారిశుద్ధ్యం

- ప్రత్యేక అధికారుల పాలనలో పనులు అస్తవ్యస్తం
- పట్టించుకోని పాలకులు, పంచాయతీ అధికారులు
- ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు


ఎస్సీ కాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు


నిండిన డ్రెయినేజీ


ఇళ్ల మధ్య నిలిచిన మురుగునీరు


డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్త

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌తో పాటు మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య లోపంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అస్తవ్యస్త డ్రెయినేజీలు, జనావాసాల్లోనే మురుగు నీటి గుంటలు, రోడ్ల పక్కనే చెత్తకుప్పలు, పందుల స్వైర విహారంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. అనునిత్యం వీఐపీలు తిరిగే నియోజవర్గ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌లోనే పారిశుద్ధ్యం అధ్వానంగా మారిందంటే ఇక గ్రామాల్లో పరిస్థితి ప్రత్యేకించి చెప్పాలిన అవసరం లేదు. ఘన్‌పూర్ పేరుకు మేజర్ గ్రామ పంచాయతీ, డివిజన్ కేంద్రమైనప్పటికీ పారిశుద్ధ్యం మాత్రంగా అధ్వానంగా ఉంది. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండగా పారిశుద్ధ్య సమస్యతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఘన్‌పూర్‌లో మొత్తం 16 వార్డులుండగా దాదాపు అన్ని వార్డుల్లో పరిస్థితి దీనంగా ఉంది. శుభ్రానికి నోచుకోని డ్రెయినేజీలు, రోడ్డుపై పారుతున్న మురుగునీరు, జనవాసాల మధ్య చెత్తకుప్పలతో కంపుకొడుతోంది. మిషన్‌భగీరథ నీటి సరఫరా సైతం సక్రమంగా జరగడం లేదు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నప్పటికీ పంచాయతీ అధికారులకు పట్టింపు లేకుండా అయింది.

ప్రత్యేక అధికారుల పాలనతో అస్తవ్యస్తం

సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం గ్రామ పంచాయతీల పాలన ప్రత్యేక అధికారులతో కొనసాగుతుంది. అయితే ప్రత్యేక అధికారులకు తమ రెగ్యులర్ విధులతోనే సతమతం అవుతుండగా గ్రామ పంచాయతీల నిర్వహణను పట్టించుకోవడం లేదు. దాంతో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందిపై ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడంతో నిర్లక్ష్యంగా పనిచేస్తున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌కు ఆర్డీఓ ప్రత్యేక అధికారిగా ఉన్నారు. ఆర్డీఓకు డివిజన్ పరిధిలోని రెవెన్యూ పరమైన అంశాలకే సమయం సరిపోతోంది. ఆర్డీఓ స్థాయి అధికారులకు గ్రామ ప్రత్యేక అధికారి బాధ్యత ఇవ్వడం ఏమాత్రం సమంజసం కాదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దానికి తోడు ఇటీవల ప్రభుత్వం మిషన్ భగీరథ సర్వే చేయిస్తుండగా పంచాయతీ అధికారులు, సిబ్బంది ఆ పనిలోనే నిమగ్నమయ్యారు. దాంతో గ్రామాల్లో వీధిదీపాలు, తాగునీటి సరఫరా, నర్సరీల నిర్వహణ, హరితహారంలో మొక్కలకు నీరు పోయడం, డ్రెయినేజీల శుభ్రత, చెత్త తొలగింపు తదితర అంశాలను పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. దాంతో గ్రామంలో ఎక్కడ చూసినా చెత్త, వ్యర్థ పదార్థాలు, నిండిన డ్రెయినేజీలు, రోడ్లపై మురుగునీరు దర్శనమిస్తుంది. ఘన్‌పూర్‌లో ప్రధానంగా లోతట్టు ప్రాంతాలైన 1, 16వ వార్డులు, ఎస్సీ కాలనీ, రైల్వే కాలనీ, ముదిరాజ్ కాలనీ, బస్టాండ్ ఏరియా, మోడల్‌కాలనీ మజీద్ కాలనీ, గాంధీ చౌరస్తా తదితర ప్రాంతాలు పారిశుద్ధ్యం లోపంతో అధ్వానంగా కనిపిస్తున్నాయి. డ్రెయినేజీలు సక్రమంగా లేకపోవడంతో రోడ్లపై, ఇళ్ల ముందు మురుగునీరు నిలిచి దుర్వాసన వ్యాపిస్తుంది. పలు చోట్ల రోడ్లపై మురుగునీరు నిలిచి చిన్నపాటి కుంటలను తలపిస్తున్నాయి. దాంతో పందులు, దోమల స్వైర విహారంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే ప్రజలు విషజ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలనీలను సందర్శించాలని, పారిశుద్ధ్య సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకోవాలి


నోట్‌బుక్స్, స్టేషనరీ అందజేస్తున్న గణేశ్

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశలోనే భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్‌గౌడ్ అన్నారు. మండలంలోని తానేదార్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి చదివే విద్యార్థులకు గణేశ్ ఆధ్వర్యంలో విద్యా సంవత్సరానికి సరిపడా నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు తదితర స్టేషనరీ సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాల్యంలో ఓనమాలతో మొదలయ్యే విద్య మన జీవితాన్ని విజయతీరాలకు చేర్చే మార్గమన్నారు. విద్యతో వినయం, సంస్కారం, విజ్ఞానం పెంపొందుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ మాచర్ల ప్రియాంకరంజిత్, హెచ్‌ఎం కొమురెల్లి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చల్లా చందర్‌రెడ్డి, కంసాని రాజిరెడ్డి, దుంపల సురేష్‌రెడ్డి, గాదె పురుషోత్తమ్, శ్రీకాంత్, నవీన్, కుమారస్వామి, వెంకటేశ్వర్లు, రమేష్, ప్రవీణ్, రంజిత్, రాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపిక


మాట్లాడుతున్న ఎంపీడీఓ సుమన్

జఫర్‌గఢ్: మండలంలోని తిమ్మంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపిక పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మండల నోడల్ ఆఫీసర్ ఎండీ పర్వేజ్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఎంపీడీఓ సుమన్ హాజరై మాట్లాడుతూ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపిక పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పోటీల ద్వారా ప్రతిభ గల విద్యార్థులు క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపికయ్యే అవకాశం లభిస్తుందన్నారు. ప్రతి విద్యార్థికి చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకునేలా వారి తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన కోరారు.

రోడ్డుపై గుంత పూడ్చివేత


రహదారిపై గుంతను పూడ్చి వేయిస్తున్న షబ్బీర్‌మియా

రఘునాథపల్లి: మండలంలోని ఫతేషాపూర్ గ్రామానికి మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎండీ షబ్బీర్‌మియా రహదారిపై ప్రమాదకరంగా మారిన గుంతను పూడ్చి వేయించి ఔదార్యం చాటాడు. నిడిగొండ–ఫతేషాపూర్ రహదారిలో పెద్ద గుంత ఏర్పడటంతో అక్కడ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సోమవారం షబ్బీర్‌మియా పొక్లెయినర్ సాయంతో ప్రమాదకరంగా మారిన గుంతను పూడ్చి వాహనదారులు మన్ననలు పొందారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


నోట్ బుక్స్ అందజేస్తున్న జగదీశ్‌చందర్‌రెడ్డి

రఘునాథపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో అనభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య లభిస్తుందని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ లింగాల జగదీశ్‌చందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఫతేషాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్కులు అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్‌చందర్‌రెడ్డి మాట్లాడుతూ సర్కార్ బడిలో ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, దుస్తులు, మధ్యాహ్నభోజనం అందిస్తారని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు గొట్టం భాస్కర్‌రెడ్డి, హెచ్‌ఎం రత్నాకర్ రెడ్డి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎండీ షబ్బీర్, ఫతేషాపూర్, ఇబ్రహీంపూర్ గ్రామశాఖల అధ్యక్షులు యామంకి శ్రీనివాస్, పోకల శ్రీనివాస్, ఉపాధ్యాయులు వెంకటేష్, కృష్ణవేణి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



చిల్పూరు: మండలంలోని ఫత్తేపూర్ పంచాయతీ పరిధిలోని బండలగట్టు శివగంగేశ్వరి ఆలయంలో సోమవారం వర్షాలు కురువాలని శివభక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్మాణ దాత, అర్చకుడు వేల్పుల లక్ష్మీగట్టయ్య ఆధ్వర్యంలో శివలింగానికి జలాభిషేకం చేసి నెయ్యి దీపంతో హారతి ఇచ్చారు.

ప్రాథమిక పాఠశాలకు టీవీ బహూకరణ


పాఠశాలకు టీవీ బహూకరిస్తున్న సరితరాజు

దేవరుప్పుల: మండలంలోని ధర్మాపురం ప్రాథమిక పాఠశాలకు హైస్కూల్ హిందీ ఉపాధ్యాయురాలు జి.సరితరాజు సోమవారం టీవీ బహూకరించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివాజీ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు బోధించడానికి టీవీ అన్నది ఒక బోధన పరికరంగా ఉపయోగపడుతుందని, దీనిని వినియోగించుకుని విద్యార్థులు విద్యను అభ్యసించాలని కోరారు. హెచ్‌ఎం రాము, జీపీ కార్యదర్శి అమరేందర్, ఉపాధ్యాయులు విజయపాల్ రెడ్డి, సరిత ఉన్నారు.

అనారోగ్య సమస్యలతో వృద్ధుడి ఆత్మహత్య


నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రఘునాథపల్లి: అనారోగ్య సమస్యలు వెంటాడుతుండటంతో జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధుడు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కురాకుల లక్ష్మయ్య (60) కొన్నాళ్లుగా అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన లక్ష్మయ్య సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గుర్తించి జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల నివాళి..

కురాకుల లక్ష్మయ్య మృతి సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలతో నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ చీమలపాటి రవీందర్‌జీ, గాదె మహేందర్‌రెడ్డి, పేర్ని రవి, పల్లెపు మురళి, నర్సింహులు, కురాకుల రాజు, రామచందర్, యాదగిరి, పెద్ద ఐలయ్య తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


సోమ్లానాయక్‌ను పరామర్శించిన నాయకులు

కొడకండ్ల: మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కున్సోత్ సోమ్లానాయక్ తండ్రి గంగ్యానాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, బాధితత కుటుంబాన్ని సోమవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు జిట్టబోయిన సోమన్న, నాయకులు రవీందర్, యాకేష్, శివకుమార్, శ్రీను, బాబునాయక్, అనిల్‌రెడ్డి ఉన్నారు.


తరిగొప్పుల: బియ్యం, వంటనూనె అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

బియ్యం అందజేత

తరిగొప్పుల: మండలంలోని అక్కరాజుపల్లి గ్రామానికి చెందిన చింతల గాలవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా, బాధిత కుటుంబసభ్యులను యూనిక్ యూత్ అసోసియేషన్ సభ్యులు సోమవారం పరామర్శించి 25 కేజీల బియ్యం, 5 కేజీల వంటనూనే అందజేశారు. రాకేశ్, కర్ణాకర్, మధు, రజినీకాంత్, రాజు, రవికుమార్, సంపత్‌కుమార్ ఉన్నారు.


రఘునాథపల్లి: ఆర్థికసాయం అందజేస్తున్న సంఘం నాయకులు

ఆర్థికసాయం

రఘునాథపల్లి: మండల కేంద్రానికి చెందిన గాదె ప్రదీప్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం విధితమే. సమాచారం తెలుసుకున్న సహచర మండల ఫొటోగ్రాఫర్ల సంఘం నాయకులు సోమవారం ప్రదీప్ నివాసానికి చేరుకొని పరామర్శించారు. ఈ సందర్భంగా సహచర ఫొటోగ్రాఫర్లు రూ.5 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ముప్పిడి సాంబ, జిల్లా ఉపాధ్యక్షుడు కొన్నె సతీష్, ప్రధాన కార్యదర్శి గంద్ర నవీన్, జిల్లా ఆర్గనైజర్ రాసమల్ల మల్లేష్, కొయ్యడ రాజు, పిట్టల మహేష్, బిర్రు సతీష్, ముసిపట్ల ధనుష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

జఫర్‌గఢ్: మండలంలోని సాగరం గ్రామ శివారు వడ్డెరకాలనీకి చెందిన శివరాత్రి ముత్యాలు(46) తేలు కాటుతో ఎంజీఎం అస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానిక ఎస్సై రవియాదవ్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శివరాత్రి ముత్యాలు ఈ నెల 21వ తేదీన తన వ్యవసాయ పంట పొలాల వద్ద పని చేస్తుండగా తేలు కాటుకు గురయ్యాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం అస్పత్రికి తరలించారు. అక్కడ కొద్ది రోజులుగా చికిత్స పొందుతూ ముత్యాలు మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

హర్షం

దేవరుప్పుల: తెలంగాణ వ్యాప్తంగా ప్రతీ నియోజకవర్గంలో సమీకృత రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టడంపై టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణనాయక్ హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వేర్వేరుగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హాస్టళ్లను ఒకే తాటిపైకి తెచ్చి అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతి కోరే దిశలో విద్య సమాన హక్కు అనే నినాదంతో కార్పొరేటీకరణ విద్యావ్యవస్థకు స్వస్తి పలికేలా రాష్ట్ర ప్రభుత్వం యోచించడం శుభపరిణామంగా అభివర్ణించారు. పేదింటి బిడ్డలు ఉన్నత శిఖరాలకు ఎదిగేలా ప్రభుత్వం యత్నంపై కృతజ్ఞతలు తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి



బచ్చన్నపేట: మండలంలోని అన్ని గ్రామాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులు, ప్రకృతి వనాన్ని సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు జీపీ సిబ్బందితో పారిశుద్ధ్య పనులను చేయించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి సౌజన్య, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో సమస్త రోగాలు దూరం

దేవరుప్పుల: వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తే సమస్త రోగాలుతమ దరికి చేరవని మండల వైద్యాధికారి రాజపురి రవితేజ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా హాస్టల్‌లో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం కింద బాలికలకు వైద్య చికిత్సలు చేసి అవగాహన కల్పించారు. డాక్టర్ రజనీకాంత్, హాస్టల్ ప్రత్యేకాధికారి సుకన్య, సీహెచ్‌ఓ వెంకటస్వామి, ఫార్మాసిస్టు పాల్గొన్నారు.

ప్రసాద్‌శర్మకు జ్యోతిష్యభీష్మ అవార్డు



దేవరుప్పుల: మండల కేంద్రంలోని చండీ పరమేశ్వరీ పీఠాధిపతి అవసరాల ప్రసాద్‌శర్మకు ఇంటర్నేషనల్ వేదిక ఆస్ట్రాలజీ కాన్వకేషన్‌లో ఇంటర్నేషనల్ ఆస్ట్రో ఎక్సలెన్స్ అవార్డుతోపాటు జ్యోతిష్యభీష్మ అవార్డు లభించింది. ఆదివారం రాత్రి న్యూఢిల్లీలోని పశ్చిమ విహార్‌లోని రాడిసన్‌బ్లూ హోటల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రసాద్‌శర్మ పురస్కారం అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జీవితాల్లో ఆశించిన వెలుగులు నిండేలా ఆధ్యాత్మికత చింతన పెంపుతోపాటు శాస్త్రీయ దృక్పథంతో జ్యోతిష్యం ద్వారా కృషి చేస్తున్న క్రమంలో నిర్వాహకులు తనకు ఇచ్చిన పురస్కారం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

వివరాలు నమోదు చేసుకోవాలి

బచ్చన్నపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో పంటలను సాగు చేసిన అన్నదాతలు వాటి వివరాలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి విద్యాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఆయన మాట్లాడారు. రైతులు వానాకాలంలో సాగు చేసిన పంటల వివరాలను ఆయా గ్రామాల వ్యవసాయ క్షేత్ర అధికారుల వద్ద నమోదు చేయించుకోవాలని, పంటల సస్యరక్షణ చర్యలకు ఏఈఓల సలహాలను కూడా పాటించాలన్నారు. ఆయా గ్రామాల రైతు వేదిక భవనాలలో ఏఈఓలు ప్రతి రోజు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యేకు ఘన స్వాగతం



జనగామ: అమెరికా పర్యటన ముగించుకుని సోమవారం స్వదేశానికి తిరిగి వచ్చిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి శంషాబాద్ ఎయిర్ పోర్టులో బీఆర్‌ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. పల్లా దంపతులను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు. స్వాగతం పలికిన వారిలో రాకేశ్‌రెడ్డి, ఇర్రి రమణారెడ్డి, బోడిగం చంద్రారెడ్డి, వడ్డెపల్లి మల్లారెడ్డి, వేముల విద్యాసాగర్, ఉల్లెంగుల సందీప్, ముస్త్యాల దయాకర్, తిప్పారపు విజయ్, రావెల రవి, హరిప్రసాద్ కానుగంటి బాలచందర్, సునీత రాజుగౌడ్ ఉన్నారు.

నేడు వీడియో కాన్ఫరెన్స్

కొడకండ్ల/దేవరుప్పుల: మండలకేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు విత్తన ఎంపిక, రైతు భరోసా, పీఎం కిసాన్ గురించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని కొడకండ్ల, దేవరుప్పుల ఏఈఓలు కొంగ నవ్య, ఎం.సాగర్ తెలిపారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరై పీఎం కిసాన్ గురించి సమస్యలుంటే తెలిపాలని వారు కోరారు.

నాలుగు మహిళా శక్తి మీసేవా కేంద్రాలు

లింగాలఘణపురం: పొదుపు సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదగడమే కాకుండా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత అందుబాటులో ఉండే విధంగా మహిళ శక్తి మీసేవా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. అందులో భాగంగా లింగాలఘణపురం మండలంలో నాలుగు కుందారం, చీటూరు, వడిచర్ల, వనపర్తి గ్రామాల్లో మీసేవా కేంద్రాలను ఏర్పాటు చేసి ఇంతకు ముందు మీసేవా కేంద్రాల్లో పొందే సేవలను అన్నింటిని అందించే విధంగా చర్యలు తీసుకోనున్నారు. కేంద్రాల నిర్వాహణకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన మహిళలను ఎంపిక చేసి స్త్రీనిధి నుంచి రుణాలను ఇస్తారు. అంతేకాకుండా మరింత ఆర్థికంగా ఎదిగేందుకు మండలంలో పెరటికోళ్ల యూనిట్లు, గేదెల యూనిట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను కూడ ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

ఎన్నిక

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్లలో సోమవారం జరిగిన మత్స్యకార్మిక సహకార సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా గంగరబోయిన స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా ఉపాధ్యక్షుడిగా ఆరె సత్తయ్య, కార్యదర్శి చంద్రమౌళి, డైరెక్టర్లుగా నరేందర్, భిక్షపతి, కుమార్, రాజు, వెంకేటశ్, కిష్టయ్యలను ఎన్నుకున్నారు.

విద్యుత్ వైరు తెగి పడి ఆవు మృతి



పాలకుర్తి: మండలంలోని విస్నూరు గ్రామంలో 11 కేవీ వైరు సోమవారం తెగి పడడంతో ఆవు మృతి చెందింది. వివరాలు.. గ్రామానికి చెందిన రైతు పాలాస అనిల్ ఆవుతో జీవనోపాధిగా పొందుతున్నారు. అయితే 11 కేవీ వైరు తెగిపడడంతో మేతకు తీసుకెళ్లిన ఆవు మృతి చెందింది. మృతి చెందిన ఆవును చూసి అనిల్, అతని భార్య విలపించారు. తమ జీవనోపాధి అయిన ఆవు మృతి చెందిందని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని వేడుకున్నారు. కాగా, ట్రాన్స్‌కో ఏఈ రణధీర్ మాట్లాడుతూ నష్టపోయిన రైతుకు రూ. 40 వేలు విద్యుత్ శాఖ అందజేస్తుందని తెలిపారు.

దాడి కేసులో నలుగురి రిమాండ్

రఘునాథపల్లి: భార్య, పిల్లలను ఎందుకు తీసుకెళ్లవని ప్రశ్నించిన నేపథ్యంలో ఓ వ్యక్తి మరో ముగ్గురితో కలిసి అత్తారింటిపై దాడికి చేసిన ఘటనలో నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై డి.నరేశ్ సోమవారం తెలిపారు. మండలంలోని మండలగూడెం గ్రామానికి చెందిన ఆరూరి సారయ్య–సునీత దంపతుల కూతురు అఖిలను లింగాలఘణపురం మండలం నెల్లుట్ల గ్రామానికి చెందిన ఉపేందర్‌కు ఇచ్చి వివాహం జరిపారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు కలిగారు. కొన్నాళ్లుగా ఉపేందర్ అదనపు కట్నం కావాలని అఖిలను వేధిస్తున్నారు. దీంతో అఖిల తల్లిగారింటి వద్ద ఉంది. భార్య, పిల్లలను ఎందుకు తీసుకెళ్లడం లేదని అఖిల బంధువులు ఉపేందర్‌కు ఫోన్ చేసి ప్రశ్నించారు. తననే ప్రశ్నిస్తారా అంటూ ఆగ్రహంతో ఉపేందర్ సోదరుడు మహేందర్, ఇద్దరు స్నేహితులు నల్ల రాజు, తూడి సంపత్‌లతో కలిసి ఈ నెల 21న తెల్లవారు జామున అత్తగారింటికి చేరుకుని ఆరుబయట నిద్రిస్తున్న వారిపై దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు దాడి చేసిన ఉపేందర్, మహేందర్, రాజు, సంపత్‌లను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వైన్స్ క్యాషియర్ అదృశ్యం


నాగరాజు

లింగాలఘణపురం: నెల్లుట్ల వైన్ షాపులో క్యాషియర్‌గా పనిచేస్తున్న జనగామ మండలం వడ్లకొండకు చెందిన బాణాల నాగరాజు ఈ నెల 20న షాపులో నుంచి మధ్యాహ్నం 2 గంటలకు పని ఉందని వెళ్లిపోయి ఇప్పటి వరకు కనిపించడంలేదు. 5 రోజులుగా షాపులో విధులకు కూడా హాజరు కానందున షాపు యజమాని ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై చింత రాజు తెలిపారు.